ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 1



తమిళనాడు
TAMILNADU

శుక్రవారం 26 ఏప్రిల్ 2024





రామరాయర్ మండపంలో దశావతారాల్లో దర్శనమిస్తున్న కళ్ళగర్

అపురూపం...

దశావతారాల్లో కళ్ళలగర్ సాక్షాత్కారం

- రాత్రంతా భక్తుల జాగారం



చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చిత్తిరై బ్రహ్మోత్సవాల్లో భాగం వైగైనదిలో వేంచేసిన కళ్ళలగర్ స్వామి స్వక్షేత్రానికి బయలుదేరి వెళుతూ బుధవారం సాయంత్రం మార్గమధ్యంలో మదురై అళ్వార్‌పురంలోని రామరాయర్ మండపానికి చేరుకున్నారు. భక్తుల సందర్శన తర్వాత కళ్ళలగర్ దశావతారాల్లో దర్శనమిచ్చే కార్యక్రమాలను వైష్ణవపండితులు నిర్వహించారు. బుధవారం రాత్రి 11 గంటల నుండి గురువారం వేకువజాము వరకూ కళ్ళలగర్‌స్వామి దశావతారాలు దాల్చి భక్తులకు నేత్రానందం కలిగించారు. ఆ సందర్భంగా భక్తులు భక్తిపారవశ్యంతో 'గోవిందా... కళ్ళలగా' అంటూ చేసిన నినాదాలు రామరాయర్ మండపం దద్దరిల్లింది. కళ్ళలగర్‌స్వామి ముత్తంగి సేవ, మత్స్యావతారం, కూర్మావతారం, వామనావతారం, రామావతారం, కృష్ణావతారం, మోహిని అవతారం అంటూ వివిధ వేషధారణలతో భక్తులను మైమరపించారు. గంట గంటకో అవతారం చొప్పున కళ్ళలగర్ స్వామి సర్వాలంకరణ శోభితుడై ప్రత్యేకపీఠం మీద భక్తులను అనుగ్రహించారు. గురువారం ఉదయం మోహిని అవతారంలో కళ్ళలగర్‌స్వామి రామరాయర్ మండప పరిసరాల్లోని వీధులలో ఊరేగారు. మధ్యాహ్నం రెండు గంటలకు రామరాయర్ మండపంలోని ఆనందరాయర్ పల్లకీలో చక్రవర్తి రూపంలో స్వామి వారు వేంచేశారు. రాత్రి 11 గంటలకు తల్లాకులంలోని రామనాథపురం సంస్థానాధీశుడి సేతుపతి మండపం చేరుకున్నారు. అక్కడ స్వామివారికి తిరుమంజనం నిర్వహించారు. శుక్రవారం వేకువజాము 2.30 గంటలకు కళ్ళర్ రూపంలో పూలపల్లకీలో ఊరేగి, అలాగే కరుప్పణ్ణసామి ఆలయానికి వెళతారు. అక్కడి నుంచి స్వామివారు అళగర్‌మలైకి బయలుదేరుతారు. మూండ్రుమావడి, అప్పన్ తిరుప్పతి, కళ్ళంత్రి మీదుగా ఈ నెల 27 శనివారం ఉదయం తన స్వక్షేత్రానికి చేరుకుంటారు.

తాగునీటికి ఢోకా లేనట్లే!

- నిర్లవణీకరణ కేంద్రాల నుంచి నీటి సరఫరాకు చర్యలు



సెంబరంబాక్కం రిజర్వాయర్

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరానికి మంచినీరు అందిస్తున్న ప్రధాన జలాశయాలు అడుగంటినా ఈ యేడాది తాగునీటికి కొరత లేనట్లేనని నీటివనరుల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రజావసరాల మేరకు ప్రభుత్వ నిర్లవణీకరణ (డిశాలినేషన్) కేంద్రాల ద్వారా సక్రమంగా నీటిని సరఫరా చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని వారు వివరించారు. నగరవాసులకు తాగునీరు సరఫరా చేసే చెంబరంబాక్కం, పూండి, చోళవరం, పుళల్, కన్నన్‌కోట-తేర్వాయ్ కండిగ, వీరాణం జలాశయాల్లో ప్రస్తుతం వేసవి కారణంగా నీటి మట్టం క్రమంగా తగ్గుతోంది. గత యేడాదితో పోల్చుకుంటే ఈ ఏప్రిల్‌లో జలాశయాల్లో నీటిమట్టం కాస్త ఎక్కువేనని అధికారులు చెబుతున్నారు. గతేడాది చెంబరంబాక్కం జలాశయంలో 2.44 టీఎంసీల నీటిమట్టం ఉండేదని, ఈ యేడాది ఆ జలాశయంలో నీటిమట్టం 2.84 టీఎంసీలుందన్నారు. పుళల్ జలాశయంలో గతేడాది 2.86 టీఎంసీలుగా నమోదైన నీటిమట్టం ప్రస్తుతం 2.42 టీఎంసీలుంది. కన్నన్‌కోట తేర్వాయ్‌కండ్రిగ జలాశయంలో గతేడాది 0.30 టీఎంసీల మేరకు జలాలుండేవని, ప్రస్తుతం 1.46 టీఎంసీల మేరకు జలాలున్నాయని అధికారులు తెలిపారు. కడలూరు జిల్లా వీరాణం చెరువు నుంచి కూడా నగరానికి తక్కువ పరిమాణంలోనే నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ విషయమై నీటి వనరుల శాఖ అధికారులు మాట్లాడుతూ వీరాణం చెరువు త్వరలో అడుగంటిపోనుందని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలుగు గంగ కాల్వ ద్వారా కృష్ణాజలాలు తీసుకువచ్చే విషయంలో కొన్ని అడ్డంకులు ఏర్పడుతున్నాయని తెలిపారు. తెలుగుగంగ ఒప్పందం ప్రకారం ప్రతియేటా ఆంధ్రప్రదేశ్ నుంచి 12 టీఎంసీల జలాలు విడుదల చేయాల్సి ఉన్నా, ఇప్పటివరకూ పూర్తిస్థాయిలో జలాలను విడుదల చేయలేదని ఆయన ఆరోపించారు. నగరానికి మంచినీరందించే జలాశయాల్లో ప్రస్తుతం 8.4 టీఎంసీల మేరకు నీటి నిల్వలున్నాయని, అయితే మరో రెండు నెలలపాటు నగరవాసులకు మంచినీటిని సరఫరా చేయడానికి ఈ జలాలు చాలవన్నారు. ఈ పరిస్థితుల్లో డిశాలినేషన్ ప్లాంట్ల నుంచి రోజుకు 350 మిలియన్ల ఘనపుటడుగుల తాగునీటిని నగరమంతటా సరఫరా చేయడానికి చర్యలు చేపడతామన్నారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా ఈ నీటిని అన్ని ప్రాంతాలకు చేరవేస్తామన్నారు.

సబర్బన్ ప్రాంతాలకు బోరుబావుల నీళ్లే...

నగరంలోని శివారు ప్రాంతాలకు బోరుబావుల ద్వారా మంచి నీటిని సరఫ రా చేయనున్నట్లు మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు. చోళింగనల్లూరు, నావలూరు, ఓఎమ్మార్, సిరుచేరి, పళ్ళిక్కరణై, సెమ్మంజేరి, కోడంబాక్కం, నోలంబూరు, పల్లావరం, క్రోంపేట తదితర ప్రాంతాల్లో ఇప్పటికే తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న రెసిడెన్షియల్ ప్లాట్లకు ట్యాంకర్ లారీల ద్వారా మెట్రోవాటర్ బోర్డు బోరుబావుల ద్వారా లభించే నీటిని ట్యాంకర్ లారీల ద్వారా సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

చెస్ ఛాంపియన్ గుకేష్‌కు ఘనస్వాగతం

విమానాశ్రయం వద్ద విద్యార్థుల అపూర్వ ఆహ్వానం

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కెనడా రాజధాని టొరంటో నగరంలో ఇటీవల జరిగిన కేండిడేట్ చెస్ పోటీల్లో టైటిల్ సాధించి తిరిగొచ్చిన గుకేష్‌కు మీనంబాక్కం విమానాశ్రయంలో గురువారం వేకువజామున ఘనస్వాగతం లభించింది. గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ పోటీల్లో టైటిల్ సాధించిన రెండో క్రీడాకారుడిగా గుకేష్ అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిగడించిన విషయం తెలిసిందే. గుకేష్ నగరానికి రానున్నట్లు ముందుగానే తెలుసుకున్న నగరానికి చెందిన వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఆ చెస్ క్రీడాకారుడికి స్వాగతం పలికేందుకు వేకువజామునే విమానాశ్రయానికి పోటెత్తడం విశేషం. రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ అధికారులు, జాతీయ, రాష్ట్రీయ చెస్ సంఘాల నిర్వాహకులు తదితరులు గుకేష్‌ను పూలమాలలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. గుకేష్ చదువుతున్న వేలమ్మాళ్ విద్యాలయ పాఠశాల విద్యార్థులు సుమారు వందమంది ఆయనకు స్వాగతమిచ్చారు. గుకేష్‌పై పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గుకేష్ విలేఖరులతో మాట్లాడుతూ.. కేండిడేట్స్ చెస్ పోటీల్లో ప్రారంభం నుంచే తాను తప్పకుండా విజయం సాధిస్తాననే నమ్మకం ఉందన్నారు. ఏడో రౌండ్‌లో ఓటమి పాలై కాస్త క్రుంగినా ఆ తర్వాత బాగా పుంజుకుని ఆడి టైటిల్ గెల్చుకోగలిగానని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఇలా ఖ్యాతిగడించడానికి కారణమైన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు, తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, కోచ్‌లకు, స్నేహితులకు, స్పాన్సర్లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని గుకేష్ తెలిపారు.



గుకేష్‌ను సత్కరిస్తున్న విద్యార్థులు

విజయం మనదే

- కాంగ్రెస్ అభ్యర్థులతో సీఎం స్టాలిన్



సీఎంతో కాంగ్రెస్ అభ్యర్థులు

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి ఘన విజయం సాధిస్తుందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమిలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీపీఐ, ఎండీఎంకే, ఐయూఎంఎల్ తదితర పార్టీలు కలిసి పని చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 19న ఎన్నికలు ముగియడంతో ఆయా పార్టీల నేతలంతా వరుసగా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకుంటున్నారు. ఎన్నికల్లో తాము చేసిన కృషి, కూటమి పార్టీల సహకారం, తమ విజయావకాశాలపై ఆయనకు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై నేతృత్వంలోని కాంగ్రెస్ అభ్యర్థులు గురువారం సీఎంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ రాష్ట్రంలో 9 స్థానాలతో పాటు పుదుచ్చేరి స్థానంలోనూ పోటీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా స్థానాల కాంగ్రెస్ అభ్యర్థులంతా సీఎంతో భేటీ అయ్యారు. ఎన్నికల్లో ప్రత్యర్థులను ఎదుర్కొన్న తీరును, ఓటర్ల నుంచి వచ్చిన స్పందన, కూటమి విజయావకాశాలపై ఆయా నేతలు సీఎంకు వివరించారు. అదే సమయంలో సీఎం కూడా తన దగ్గరున్న సమాచారాన్ని వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూన్ 4వ తేదీ వెలువడే ఫలితాల్లో రాష్ట్రం నుంచి ఇండియా కూటమి ఘన విజయం సాధిస్తుందని వ్యాఖ్యానించారు. కూటమి నేతలంతా గట్టిగా పోరాడారని, అందువల్ల అత్యధిక శాతం స్థానాలు కూటమివేనని ధీమా వ్యక్తం చేసినట్టు తెలిసింది. దేశవ్యాప్తంగా కూడా ప్రధాని మోదీ వ్యాఖ్యల పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతోందని, అందువల్ల ఆ ప్రభావం ఇప్పుడు జరుగనున్న ఎన్నికలపైనా పడడం ఖాయమన్నారు. దేశంలోనూ ఇండియా కూటమి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేసినట్టు కాంగ్రెస్ అభ్యర్థులు తెలిపారు.

'ఎలక్షన్ సెల్' సిబ్బందికి అభినందన



సర్టిఫికెట్లు అందజేస్తున్న పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్

పెరంబూర్, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషిచేసిన 'ఎలక్షన్ సెల్‌'లో పనిచేసిన అధికారులు, పోలీసులను కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ అభినందించారు. రాష్ట్రంలో ఈ నెల 19న జరిగిన లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా నగర పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. చెన్నై జిల్లా పరిధిలో మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలు గుర్తించి, ప్రత్యేక పోలీసు భద్రత ఏర్పాటుచేసి ఎన్నికల సజావుగా జరిగేందుకు కృషిచేసింది. ఈ నేపథ్యంలో, ఎన్నికల్లో బందోబస్తు, గస్తీ తదితరాల పర్యవేక్షణకు నగర పోలీసు కార్యాలయంలో ఫిబ్రవరిలో 'ఎలక్షన్ సెల్' ఏర్పాటుచేశారు. ఈ సెల్‌లో ఐదుగురు డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సీఐ, ఎస్‌ఐ, పోలీసులు మొత్తం 87 మంది షిఫ్టుల పద్ధతిలో 24 గంటలు విధులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషిచేసిన ఎలక్షన్ సెల్‌లో పనిచేసిన అధికారులు, పోలీసులను గురువారం జరిగిన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

తొలివిడత ఎన్నికల్లో

బీజేపీ ఒక్క స్థానంలో కూడా గెలవదు

- టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై





మీడియాతో మాట్లాడుతున్న సెల్వ పెరుందగై - హసీనా సయ్యద్‌కు స్వాగతం పలుకుతున్న మహిళా కార్యకర్తలు

ప్యారీస్, ఏప్రిల్ 25: లోక్‌సభ తొలివిడత ఎన్నికల్లో బీజేపీ ఒక్క స్థానంలో కూడా గెలిచే ప్రసక్తే లేదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వ పెరుందగై జోస్యం చెప్పారు. స్థానిక రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో గురువారం రాష్ట్ర కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన హసీనా సయ్యద్‌ను మహిళా కార్యకర్తలకు సెల్వ పెరుందగై పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలను ప్రధాని నరేంద్ర మోదీ వ్యతిరేకిస్తున్నారని, లోక్‌సభ ఎన్నికల తొలివిడత ప్రచారంలో కూడా ఈ వర్గాలను కించపరిచేలా మోదీ వ్యవహరించారని, అందువల్ల ఈ నెల 19న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా వచ్చే ప్రసక్తే లేదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో కులమతాల చిచ్చు రగిల్చే విధంగా వ్యవహరిస్తున్న మోదీని జరగబోయే లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా కట్టడి చేయాలని, ఆయన ప్రచార సభలు, రోడ్ షోల్లో పాల్గొనేందుకు ఎన్నికల కమిషన్ అనుమతించకూడదని డిమాండ్ చేశారు. మహిళలు పవిత్రంగా భావించే మాంగల్యం గురించి కించపరుస్తూ మాట్లాడిన మోదీని ఖండిస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను, సలహాలను పాటిస్తున్న బీజేపీకి ఈ లోక్‌సభ ఎన్నికలే చివరివని, ఇది దేశప్రజల తీసుకున్న నిర్ణయమని సెల్వ పెరుందగై వ్యాఖ్యానించారు.

రేక్లా రేస్‌కు గ్రీన్ సిగ్నల్

- హైకోర్టు ఆదేశం



ప్యారీస్, ఏప్రిల్ 25: పాత జీవో ప్రకారం రాష్ట్రంలో రేక్లా రేస్ జరుపుకొనేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మదురై అవనియాపురానికి చెందిన కన్నన్ దాఖలుచేసిన పిటిషన్‌లో... ప్రాణుల సంరక్షణ, భద్రతా చర్యలకు ప్రాధాన్యం కల్పిస్తూ రాష్ట్రంలో ప్రాచీన సంప్రదాయ క్రీడగా రేక్లా రేస్ నిర్వహిస్తున్నారని, ఇందుకు రాష్ట్ర పోలీసు శాఖ కూడా కొత్త నిబంధనలతో అనుమతులు మంజూరు చేసిందని వివరించారు. అయితే డీజీపీ కొత్త నిబంధనలను రద్దు చేసి, పాత జీవో ప్రకారమే రేక్లా రేస్ నిర్వహించేలా అనుమతించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు ఆర్.సురేష్‌కుమార్, జి.అరుళ్‌మురుగేశ్‌లతో కూడిన హైకోర్టు మదురై ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషన్‌పై హోం శాఖ కార్యదర్శి, డీజీపీల తరఫున నివేదిక దాఖలుచేయాలని, అప్పటివరకు ఆలయాల్లో ప్రస్తుతం జరుపుకుంటున్న వేడుకల్లో రేక్లా రేస్‌ను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జరుపుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణ జూన్‌కు వాయిదావేసింది.

ఏడు వేల కొత్త బస్సుల కొనుగోలుకు చర్యలు

రవాణా శాఖ మంత్రి శివశంకర్

ప్యారీస్, ఏప్రిల్ 25: రాష్ట్రప్రభుత్వం రవాణా సంస్థల కోసం కొత్తగా 7,000 బస్సులు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ మంత్రి ఎస్‌ఎస్ శివశంకర్ పేర్కొన్నారు. 2015వ సంవత్సరం అన్నాడీఎంకే ప్రభుత్వ హయాం లో ప్రభుత్వ ఇసుక క్వారీలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ అరియలూరు జిల్లా సన్నాసినల్లూర్ గ్రామప్రజలతో కలసి అప్పటి కున్నం ఎమ్మెల్యే గా వ్యవహరించిన శివశంకర్, ఇసుక క్వారీలను ముట్టడించి ప్రభుత్వ వాహనాలు ధ్వంసం చేశారని శివశంకర్‌తో పాటు 37 మందిపై కేసు నమోదైంది. గురువారం ఉదయం కడలూరు ప్రిన్సిపల్ కోర్టులో జరిగిన విచారణకు మంత్రి శివశంకర్ హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణ జూన్ 6వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ... గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో కొత్త బస్సులు కొనుగోలు చేయనందు వలన ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు 7,000 కొత్త బస్సులు కొనుగోలు చేసేందుకు టెండర్లు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 350 బస్సులు కొత్తగా డిజైన్ చేయించి రవాణా సంస్థలకు పంపిణీ చేశామని, దశలవారీగా బస్సులు కొనుగోలు చేస్తామన్నారు. తిరుచ్చిలో బస్సులో సీటు సరిచేసే సమయంలో కండక్టర్ కిందపడ్డారని, దీనిపై విచారణకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

అరెస్ట్ అయిన వారు తెలుసు... డబ్బు నాది కాదు

రూ.4 కోట్లపై ఇంత రాద్ధాంతమా...? ● నయినార్ నాగేంద్రన్

పెరంబూర్, ఏప్రిల్ 25: తిరునల్వేలి రైలులో రూ.4 కోట్ల నగదు పట్టుబడిన వ్యవహారంలో విచారణకు హాజరుకావాలని నయినార్ నాగేంద్రన్‌కు రెండోసారి సమన్లు జారీ అయ్యాయి. తాంబరం రైల్వేస్టేషన్‌లో ఈ నెల 6వ తేది ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో తిరునల్వేలి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ కారు డ్రైవర్ సతీష్, సహాయకుడి నుంచి రూ.4 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న ఈ డబ్బుకు సంబంధించి సమాధానం చెప్పాలని నయినార్ నాగేంద్రన్ సహా పలువురికి తాంబరం పోలీసులు ఈ నెల 22న విచారణకు హాజరుకావాలని సమన్లు జారీచేశారు. కానీ, నేరుగా హాజరయ్యేందుకు అవకాశం కావాలని నయినార్ నాగేంద్రన్ కోరిన తరుణంలో మే 2వ తేది విచారణకు హాజరుకావాలని పోలీసులు సమన్లు జారీచేశారు. ఈ విషయమై స్థానిక బీజేపీ కార్యాలయంలో నయినార్ నాగేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ... ఈ చర్యలు రాజకీయ కుట్రలో భాగమన్నారు. రాష్ట్రంలో రూ.200 కోట్లు స్వాధీనం చేసుకోగా, రూ.4 కోట్లకు మాత్రమే వివరణ కోరడంలో అర్థం ఏంటని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో అరెస్టయిన వారు నా పేరు చెబితే నేనెలా బాధ్యత వహించగలనన్నారు. పోలీసుల కారణంగా నాకు ఉచితంగానే అధిక ప్రచారం జరిగిందని అన్నారు. పోలీసులు పంపిన సమన్ల ప్రకారం మే 2వ తేదిలోపే హాజరై వివరణ ఇవ్వనున్నానని, విచారణ అనంతరం ఈ కేసులో అరెస్టయిన వారు ఎలాంటి వాంగ్మూలం ఇచ్చారో తెలుస్తుందని నయినార్ నాగేంద్రన్ తెలిపారు.

సమాచార దర్శిని

మార్కులు 'ఎమిస్'లో అప్‌లోడ్ చేయాలి

ఐసిఎఫ్, ఏప్రిల్ 25: ఐదవ తరగతి వరకు విద్యార్థుల మూడవ సెమిస్టర్ మార్కులను 'ఎమిస్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా విద్యాధికారులకు ప్రాథమిక విద్యా డైరెక్టర్ కన్నప్పన్ ఉత్తర్వులు జారీచేశారు. ఒక్కొక్క పాఠ్యాంశం వారీగా మార్కులు నమోదుచేయడంతో పాటు పరీక్షకు ఆబ్సెంట్ అయిన వివరాలు కూడా నమోదుచేయాలని సూచించారు.

అన్నా వర్సిటీ పోస్టులకు పోటీ పరీక్ష

ఐసిఎఫ్, ఏప్రిల్ 25: అన్నా విశ్వవిద్యాలయ సహాయ ప్రొఫెసర్ సహా 232 ఖాళీ పోస్టుల భర్తీకి ఉపాధ్యాయ ఎంపిక బోర్డు(టీఆర్బీ) పోటీపరీక్ష నిర్వహించనుంది. ఈ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పనిచేసే కళాశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీకి గతఏడాది నవంబరులో నోటిఫికేన్ విడుదలైంది.ఆనెలలోనే దరఖాస్తుస్వీకరణ జరిగింది.60 మార్కులకు థియరీ, 20మార్కుల ప్రాక్టికల్, ఇంటర్వ్యూకు 20మార్కులుగా నిర్ణయించారు. పరీక్షా విధానం గురించి త్వరలో వెల్లడిస్తామని అన్నావర్సిటీతెలిపింది.ఈనేపథ్యంలో, అన్నావర్శిటీ విడుదలచేసిన ప్రకటనలో...ఈ పోస్టుల భర్తీకి టీఆర్బీ పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపింది. ఇప్పటివరకు ఉద్యోగ నియామకాలు చేపట్టే అన్నా వర్సిటీ, ఈ బాధ్యతలు టీఆర్బీకి అప్పగించడం గమనార్హం.

సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 25: ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటుచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభు త్వం దేశవ్యాప్తంగా కోటి గృహాల పైకప్పులపై ఉచితంగా సోలార్ ప్యానళ్లు ఏర్పాటుచేసే పథకాన్ని పరిచయం చేసింది. ఈ పథకం కింద కిలోవాట్ సామర్థ్యంతో సోలార్ కేంద్రం ఏర్పాటుకు రూ.30 వేలు, 2 కిలోవాట్‌కు రూ.60 వేలు, ఆపైన ఒక్కో కిలోవాట్‌కు రూ.18 వేలు సబ్సిడీ అందజేస్తుంది. ఆసక్తి ఉన్న వారు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సోలార్ ప్యానెళ్లు ఏర్పాటుచేయగానే సబ్సిడీ లబ్ది దారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుంది.

కొత్త మఠాధిపతిగా కుమారస్వామి

ఐసిఎఫ్, ఏప్రిల్ 25: చిదంబరం మౌన మఠం కొత్త మఠాధిపతిగా మౌనకుమారస్వామి బాధ్యతలు స్వీకరించారు. చిదంబరం సభానాయకర్ ఆలయ వీధిలో ఉన్న ఈ మఠం 8వ పీఠాధిపతి సుందరమూర్తి స్వామి మంగళవారం ముక్తిచెందారు. 9వ మఠాధిపతిగా ఆయన స్థానంలో మౌనకుమార స్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

వీధుల వివరాల సేకరణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 25: వీధుల వివరాలు సేకరించాలని సబ్ రిజిస్ట్రార్లకు రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో సర్వే నెంబరు ద్వారా భూములకు మార్గదర్శక విలువ నిర్ణయిస్తున్నారు. ఒక్కో ప్రాంతానికి వీధుల వారీగా ఈ విలువ నిర్ణయిస్తుంటారు. ఈ నేపథ్యంలో, నగర విస్తరణ కారణంగా ఏర్పాటైన కొత్త ప్రాంతాల్లో ఉన్న వీధుల వివరాలు సేకరించి ఈ నెల 30వ తేదీ లోపు పంపించాలని సబ్ రిజిస్ట్రార్లకు రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

త్వరలో గోధుమ 'బీరు'

ఐసిఎఫ్, ఏప్రిల్ 25: తొలిసారిగా పూర్తిగా గోధుమలతో తయారుచేసిన బీరు సహా ఐదు రకాల కొత్త రకం బీర్లను దుకాణాల్లో విక్రయించనున్నట్లు టాస్మాక్ సంస్థ తెలిపింది. వేసవి కారణంగా సాధారణ రోజుల్లో 60 వేల కేసులు విక్రయమవుతున్న బీరు లక్ష కేసులకు విక్రయమవుతోంది. ఇదివరకే దుకాణాల్లో 35 రకాల బీర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, 100 శాతం గోధుమలతో తయారుచేసిన '100 పర్సెంట్ వీట్ బీర్' పేరుతో కొత్త బీరు పరిచయం చేయనున్నారు. ఈ బీరు ధర రూ.190గా నిర్ణయించారు. వీటితో సహా మరో ఐదు రకాల బీర్లు కూడా అందుబాటులోకి రానున్నాయి.

ఇంటి నుంచే సబర్బన్ రైలు టిక్కెట్లు

పెరంబూర్, ఏప్రిల్ 25: ఇంటి నుంచే సబర్బన్ రైళ్ల టిక్కెట్లు, ప్లాట్ ఫారం టిక్కెట్లు పొందే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. నగరం, శివారు ప్రాంతాలకు నడుపుతున్న సబర్బన్ రైళ్లలో ప్రతిరోజు లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు. ఉదయం, సాయం త్రం రద్దీ సమయాల్లో టిక్కెట్లు పొందేందుకు ప్రయాణికులు కౌంటర్ల వద్ద క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా సబర్బన్ రైలు టిక్కెట్లు పొందే సౌకర్యం దక్షిణ రైల్వే కల్పించింది. కానీ, ఈ టిక్కెట్లు రైల్వేస్టేషన్ ప్రాంగణాల్లో పొందాల్సి రావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై అందిన ఫిర్యాదులపై దృష్టి సారించిన రైల్వే శాఖ, ప్రయాణికులు తమ ఇంటి నుంచే యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని, అదే సమయంలో, టిక్కెట్లు పొందిన రెండు గంటల్లో ప్రయాణం చేయాల్సి ఉంటుందని తెలియజేసింది.

పెరిగిన కంచి పట్టుచీరల ధరలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 25: కంచి పట్టు చీరల ధరలు పెరిగాయి. కాంచీపురం చేనేత పట్టుచీరలు ప్రపంచప్రసిద్ధి గాంచినవి. కేంద్ర ప్రభుత్వ భౌగోళిక గుర్తింపు పొందిన పారంపర్య పట్టుచీరల ఉత్పత్తి వివిధ కారణాలతో రోజురోజుకు దెబ్బతింటోంది. వెండి, బంగారు సరిగతో నేయడం వల్ల 25 ఏళ్ల పాటు ఈ చీరలు మన్నికతో ఉంటున్నాయి. ఏడాదికి సుమారు రూ.300 కోట్లకు ఈ చీరల వ్యాపారం జరుగుతోంది. కనిష్ఠంగా రూ.10 వేలు నుంచి రూ.2 లక్షల వరకు చీరల ధరలుంటాయి.ఈ నేపథ్యంలో, సరిగ ధరలు పెరగడంతో చీరల ధరలు కూడా తయారీదారులు పెంచారు. గత ఏడాది కన్నా 30 శాతం వరకు ధరలు పెరిగాయి.

35వ సారి సెంథిల్ బాలాజీ రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 25: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను 35వ సారి న్యాయస్థానం పొడిగించింది. చట్టవ్యతిరేక నగదు మార్పిడి నిరోధక చట్టం కింద గత ఏడాది జూన్‌లో సెంథిల్ బాలాజీని అరెస్ట్ చేసిన ఈడీ, కోర్టు ఉత్తర్వులతో పుళల్ కేంద్ర కారాగారానికి తరలించింది. ఈ నేపథ్యంలో, సెంథిల్ బాలాజీ రిమాండ్ గురువారంతో ముగియడంతో ఆయనను జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరుపరచగా, ఆయన రిమాండ్‌ను ఈ నెల 30వ తేది వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి అల్లి ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఈ కేసు నుంచి తనను విడిపించాలని కోరుతూ సెంథిల్ బాలాజీ తరఫున దాఖలైన పిటిషన్‌పై చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఈ నెల 30న తీర్పు వెలువరించనుంది.

గుంకీ ఏనుగుల తరలింపునకు చర్యలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 25: టాప్ స్లిప్‌లో నీటి ఎద్దడి, ఆహార కొరత కారణంగా 26 గుంకీ ఏనుగులను వేరే శిబిరాలకు తరలించేందుకు అటవీ శాఖ చర్యలు చేపట్టింది. కోయంబత్తూర్ జిల్లాలో గత రెండు నెలలుగా ఎండ తీవ్రత కారణంగా నీటి ఎద్దడి నెలకొంది. పొల్లాచ్చి సమీపంలోని ఆనమలై టాప్ స్లిప్‌లో ఉన్న ఏనుగుల శిబిరంలో సంరక్షించే 26 ఏనుగులను నీరు, ఆహార వసతి ఉన్న ఇతర శిబిరాలకు తరలించనున్నామని అధికారులు తెలిపారు.

ఎస్కేపీడీలో కనువిందుగా కోలాట ప్రదర్శన



లలితా మనోహరి బృందం కోలాట ప్రదర్శన

ప్యారీస్, ఏప్రిల్ 25: స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 9వ రోజైన గురువారం సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను బంగారు కేడెం అలంకారంతో కొలువుదీర్చి అభిషేకాలు, ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా మనోహరి బృందం కోలాట ప్రదర్శన అలరించింది. ఈ వేడుకల్లో దేవస్థానం పాలక మండలి సభ్యులు పాల్గొని భక్తులకు ప్రసాదం వినియోగించారు.

హుండీ ఆదాయానికీ తప్పని కోడ్!

పెరంబూర్, ఏప్రిల్ 25: వాహనంలో తీసుకెళ్తున్న కన్నగి ఆలయ హుండీ ఆదాయం రూ.96 వేలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో ఈ నెల 19వ తేది లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో, జిల్లాల పరిధిలో వాహన తనిఖీలను ఎన్నికల సంఘం ఉపసంహరించుకుంది. అదే సమయంలో కేరళలో ఈ నెల 26వ తేది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాష్ట్ర సరిహద్దుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టి, తగిన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి తీసుకెళ్తున్న నగదు, వస్తువులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కూడలూరు పశ్చిమ కొండ ప్రాంతంలో ఉన్న కన్నగి ఆలయంలో గురువారం జరిగిన చిత్రా పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకొని కానుకలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించిన ఆలయ ట్రస్టీలు వాహనంలో నగదు తీసుకొని బయల్దేరారు. లోయర్ క్యాంప్ బెన్నీక్విక్ మణిమండపం మార్గంగా వస్తున్న వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె.కార్తీరాజ్ నేతృత్వంలోని అధికారులు అడ్డుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేసి రూ.96,885 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదు ఎలాంటి రసీదులు లేవని, తగిన ఆధారాలు చూపించి నగదు తీసుకెళ్లవచ్చని ఆలయ ట్రస్టీలకు తెలిపిన అధికారులు, స్వాధీనం చేసుకున్న నగదును ఉత్తమపాళయం ట్రెజరీకి అప్పగించారు.

ఆన్‌లైన్ రమ్మీలో రూ.25 లక్షల నష్టం

● హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

పెరంబూర్, ఏప్రిల్ 25: ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడి దాదాపు రూ.25లక్షలు నష్టపోయిన ఓ హెడ్ కానిస్టేబుల్ బలవర్మరణానికి పాల్పడ్డాడు. తంజావూరు జిల్లా తిరువయ్యారు సమీపం వెల్లాంబరంపూర్‌కు చెందిన పుహేంది (45) మరువూర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 13వ తేది అలంగుడిలోని ఓ తోటలో ఎలుకల మందు తీసుకున్నట్లు తెలిసింది. అనంతరం మూడు రోజులు యథావిధిగా డ్యూటీకి వెళ్లిన అతను, మరుసటిరోజు అస్వస్థతకు గురయ్యాడు. అతడిని వెంటనే తంజావూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక గురువారం పుహేంది మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. పుహేంది కొంత కాలంగా ఆన్‌లైన్ రమ్మీ ఆడుతూ సుమారు రూ.25 లక్షల వరకు కోల్పోయినట్లు, ఆ బాధతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

ఊడిన కండక్టర్ సీటు.. ముగ్గురిపై సస్పెన్షన్ వేటు

ప్యారీస్, ఏప్రిల్ 25: తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థకు చెందిన బస్సులో కండక్టర్ సీటు ఊడిపోయిన వ్యవహారంలో బస్ డిపో మేనేజర్ సహా ముగ్గురు ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యారు. తిరుచ్చి సెంట్రల్ బస్‌స్టేషన్ నుంచి కేకే నగర్‌కు మంగళవారం ఓ ప్రభుత్వ బస్సు ప్రయాణికులతో బయల్దేరింది. కండక్టర్‌గా ఎడమలైపుదూర్‌కు చెందిన మురుగేశన్ వ్యవహరించారు. ఆ బస్సు సెంట్రల్ బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న కలై అరంగం జంక్షన్‌లో మలుపు తిరుగుతున్న సమయంలో సీటులో కూర్చున్న కండక్టర్ రోడ్డుపై పడ్డాడు. దీంతో కండక్టర్ తలకు గాయాలయ్యాయి. డ్రైవర్ వెంటనే బస్సు ఆపి మిగతా ప్రయాణికులను మరో బస్సు ఎక్కించారు. ఈ నేపథ్యంలో, కండక్టర్ సీటు ఊడిన వ్యవహారం సోషల్ మీడియాలో వైరలైంది. దీనిపై స్పందించిన ప్రభుత్వ రవాణా సంస్థ తిరుచ్చి జోన్ జనరల్ మేనేజర్ ముత్తుకృష్ణన్, బస్ డిపో మేనేజర్ రాజశేఖర్ సహా ముగ్గుర్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

చెంగల్పట్టు సమీపంలో రూ.లక్ష విలువైన మద్యం స్వాధీనం

ప్యారీస్, ఏప్రిల్ 25: జిల్లా కేంద్రం చెంగల్పట్టు సమీపంలోని పులిపాక్కం ప్రాంతంలో చట్టవిరుద్ధంగా నిల్వచేసిన లక్ష విలువ చేసే మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పులిపాక్కం ప్రాంతంలో బ్లాక్‌లో విక్రయించేందుకు మద్యం సీసాలు దాచిపెట్టారని చెంగల్పట్టు ఎక్సైజ్ విభాగానికి సమాచారం అందింది. దీంతో, రంగంలో దిగిన పోలీసులు పులిపాక్కం ప్రాంతంలోని ఓ ఇంట్లో తనిఖీ చేసి, 150కి పైగా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి కాళిదాస్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరుపరచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవం

ప్యారీస్, ఏప్రిల్ 25: చెంగల్పట్టు జిల్లా హస్తినాపురంలో భార్యను హతమార్చిన భర్తకు న్యాయస్థానం యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. హస్తినాపురానికి చెందిన వరప్రసాదం (60), విశ్వాసం (52) అనే భార్యాభర్తలు భవన నిర్మాణ కార్మికులుగా వేర్వేరు ప్రాంతాల్లో పనిచేసేవారు. భార్య విశ్వాసం ఉదయాన్నే పనులకు వెళ్లి రాత్రి ఆలస్యంగా ఇంటికి వస్తుండడంతో వరప్రసాద్‌కు ఆమెపై అనుమానం కలిగింది. ఈ వ్యవహారంలో భార్యాభర్తలు తరచూ గొడవపడుతుండేవారు. ఈ నేపథ్యంలో 2022 అక్టోబరు 19వ తేది అర్ధరాత్రి నిద్రపోతున్న భార్యను వరప్రసాద్ కత్తితో నరికి హత్యచేసినట్లు ఆయన కుమార్తె ఆనంది చిట్లపాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెంగల్పట్టు జిల్లా మహిళా న్యాయస్థానంలో గురువారం ఈ కేసు విచారణ పూర్తికావడంతో న్యాయమూర్తి ఎళిలరసి నిందితుడు వరప్రసాద్‌కు యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

అక్రమార్జన కేసు... కోర్టులో హాజరైన మాజీ మంత్రి సి.విజయభాస్కర్

ప్యారీస్, ఏప్రిల్ 25: అక్రమార్జన కేసు వ్యవహారంలో అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డా.సి.విజయభాస్కర్, ఆయన భార్య గురువారం పుదుకోట జిల్లా ప్రిన్సిపల్ కోర్టులో విచారణకు హాజరయ్యారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశాఖ మంత్రిగా, విరాలిమలై ఎమ్మెల్యేగా సి.విజయభాస్కర్ వ్యవహరించారు ఆయన ఆదాయానికి మించి రూ.35.79 కోట్లకు పైగా ఆస్తులు కూడబెట్టారని ఆయనతో పాటు సతీమణి రమ్యపై పుదుకోట అవినీతి నిరోధక శాఖ పోలీసులు 2021 అక్టోబరు 17న కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో, పుదుకోట జిల్లా ఇలుప్పూర్‌లో ఉన్న ఆయన ఇల్లు, క్వారీ, సంస్థలు, చెన్నైలో ఉన్న ఇల్లు మొత్తం 56 ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేసి, అక్రమార్జన కేసుకు సంబంధించి 200 పేజీలతో కూడిన ఛార్జిషీటును పుదుకోట జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో దాఖలుచేశారు. గురువారం 14వ సారి ఈ కేసు విచారణకు రాగా విజయభాస్కర్ దంపతులు హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణ మే 12వ తేదీకి వాయిదావేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

కార్మిక దినోత్సవ వేడుకలకు అనుమతి

● ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు

పెరంబూర్, ఏప్రిల్ 25: కార్మిక దినోత్సవం (మే 1వ తేది) జరుపుకొనేందుకు సంబంధిత జిల్లా ఎన్నికల అధికారుల వద్ద అనుమతి పొందవచ్చని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు తెలిపారు. మే డే సందర్భంగా రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు ర్యాలీలు, పలు కార్యక్రమాలు చేపడుతుంటాయి. కానీ, ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ర్యాలీలు, కార్యక్రమాల నిర్వహణకు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, కార్మిక దినోత్సవాన్ని జరుపుకొనేందుకు అనుమతివ్వాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి సీపీఎం లేఖ రాసింది. దీనిపై స్పందించిన ఎన్నికల కమిషన్, మే డే జరుపుకొనేందుకు సంబంధిత ఎన్నికల అధికారుల వద్ద అనుమతి పొందవచ్చని తెలియజేసింది.

సేలం నడిరోడ్డుపై ఆమ్లెట్

ఇద్దరిని హెచ్చరించి పంపిన పోలీసులు



రోడ్డుపై హాఫ్ బాయిల్ వేస్తున్న దృశ్యం

పెరంబూర్, ఏప్రిల్ 25: దేశంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన నగరాల్లో సేలం మూడవ స్థానంలో నిలిచింది. ఈ నెల 23న సేలంలో 42.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రత కారణంగా మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ నేపథ్యంలో, ఎండ తీవ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఇద్దరు వ్యక్తులు గురువారం మధ్యాహ్నం సేలం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న రౌండ్ ఠానా గోడపై హాఫ్ బాయిల్ ఆమ్లెట్ వండినట్లు చేశారు. కలెక్టర్ కార్యాలయ వద్ద ఉన్న పోలీసులు వారిని హెచ్చరించి పంపారు.

కిరోసిన్ కోటా తగ్గించిన కేంద్రం

● మంత్రి చక్రపాణి

పెరంబూర్, ఏప్రిల్ 25: రాష్ట్రానికి అందించాల్సిన కిరోసిన్ కోటాను కేంద్రప్రభుత్వం తగ్గించిందని ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2021లో 8,500 కిలో లీటర్ల కిరోసిన్ అందజేసిన కేంద్రప్రభుత్వం, 2022లో 4,500 కిలో లీటర్లకు తగ్గించిందన్నారు. ప్రస్తుతం 2,300 కిలో లీటర్ల కిరోసిన్ మాత్రమే అందించడంతో రేషన్ దుకాణాల ద్వారా కిరోసిన్ అందించడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయని మంత్రి తెలిపారు.

186 హెచ్‌ఐవీ కేంద్రాల మూసివేత

ఐసిఎఫ్, ఏప్రిల్ 25: రాష్ట్రంలో హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య తగ్గడంతో 186 కేంద్రాలు మూసివేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చికిత్స పొందుతున్న 2 లక్షల మంది హెచ్‌ఐవీ బాధితులకు మందులు, మాత్రలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. 1,000 మందిలో 0.17 శాతం మంది ఈ వ్యాధికి గురవుతున్నారని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ప్రణాళికా డైరెక్టరేట్ తెలిపింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో 377 ఎయిడ్స్ పరిశోధన, కౌన్సిలింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో ఏడాదికి పది మంది బాధితులు కూడా రాని కేంద్రాలను గుర్తించి వాటిని మూసివేయాలని అధికారులు నిర్ణయించారు.ఆ ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా 186 ప్రాంతాల్లో ఉన్న కేంద్రాలు త్వరలో మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మణిముత్తారు జలపాతంలో స్నానాలకు అనుమతి

పెరంబూర్, ఏప్రిల్ 25: తిరునల్వేలి జిల్లా అంబాసముద్రం సమీపంలోని మణిముత్తారు జలపాతం వద్ద పర్యాటకుల స్నానాలకు అటవీ శాఖ అనుమతించింది. డిసెంబరులో కురిసిన భారీవర్షాలకు జలపాతం వద్ద వరద ఉధృతి అధికం కావడంతో జలపాతం రక్షణ గోడలు, గట్లు దెబ్బతిన్నాయి. వీటికి మరమ్మతులు చేపట్టిన కారణంగా జలపాతం వద్దకు పర్యాటకులు వెళ్లేందుకు అటవీ శాఖ నిషేధం విధించింది. పనులు పూర్తికావడంతో శుక్రవారం నుంచి జలపాతం వద్దకు పర్యాటకులను అనుమతించనున్నట్లు అటవీ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

వ్యాపారి హత్య కేసులో రౌడీకి ఏడేళ్ల జైలుశిక్ష

ప్యారీస్, ఏప్రిల్ 25: స్థానిక ట్రిప్లికేన్ నియోజకవర్గం ఐస్‌హౌస్ ప్రాంతంలో వ్యాపారిని హత్యచేసిన రౌడీకి మద్రాసు అడిషినల్ కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. ఐస్‌హౌస్ ప్రాంతంలో దుకాణం నడిపిన బాబు అనే వ్యాపారికి 2022వ సంవత్సరం అదే ప్రాంతానికి చెందిన బాలాజీ, యువరాజ్ అనే రౌడీలు కత్తి చూపి బెదిరించి రూ.5 వేలు డిమాండ్ చేశారు. అందుకు నిరాకరించిన బాబును చితకబాది, దుకాణంలో ఉన్న రూ.1,000 నగదు దోచుకొని పరారయ్యారు. తీవ్రగాయాలైన బాబును రాయపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించిన పోలీసులు, దీనిపై కేసు నమోదుచేసి బాలాజీ, యువరాజ్‌లను అరెస్ట్ చేశారు. చికిత్స ఫలించక బాబు మరణించడంతో ఈ కేసును హత్యకేసుగా మార్చారు. మద్రాసు అడిషినల్ కోర్టులో జరిగిన విచారణ పూర్తికావడంతో న్యాయమూర్తి మురుగానందం గురువారం తీర్పు చెప్పారు. ఇందులో యువరాజ్‌కు సంబంధించిన ఆధారాలను పోలీసులు సమర్పించకపోవడంతో అతడిని విడుదల చేసిన న్యాయస్థానం, బాలాజీకి ఏడేళ్ల కఠిన కారాగారశిక్షతో పాటు రూ.12,000 జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

● అంధకారంలో తిరువొత్తియూర్

ప్యారీస్, ఏప్రిల్ 25: స్థానిక తిరువొత్తియూర్ కలైంజర్ నగర్ మెయిన్ రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో బుధవారం అర్ధరాత్రి మంటలు వ్యాపించడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అందువల్ల ఉక్కపోతతో తిరువొత్తియూర్, సత్యమూర్తినగర్, కలైంజర్‌నగర్, వత్తవాడ ప్రాంతాల ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. స్థానిక డీఎంకే ఎమ్మెల్యే కేపీ శంకర్, కాంగ్రెస్ కౌన్సిలర్ ఎమ్మెస్ ద్రవ్యం ఘటనాస్థలికి చేరుకున్నారు. వారిచ్చిన సమాచారంతో విద్యుత్ బోర్డు సిబ్బంది, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయడంతో తెల్లవారుజామున తిరువొత్తియూర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

'స్మోక్ బిస్కెట్' హానికరం

ఐసిఎఫ్, ఏప్రిల్ 25: ద్రవ నైట్రోజన్ ద్వారా తయారుచేసే 'స్మోక్ బిస్కెట్లు' తినడం పిల్లల ఆరోగ్యానికి హానికరమని ఆహార భద్రతా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఈ రకం బిస్కెట్లు తిన్న ఓ బాలుడు తీవ్ర అస్వస్థతకు గురైన విషయం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో, అలాంటి బిస్కెట్లు పిల్లలకు ఇవ్వరాదని, ఒక్కోసారి ప్రాణాపాయం కూడా సంభవించే ప్రమాదముందని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరించారు.

బాలికను రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తి అరెస్టు

అడయార్, ఏప్రిల్ 25: సేలం జిల్లా ఓమలూరు సమీపంలోని అడైక్కనూరు ప్రాంతానికి చెందిన వినోద్ (35) ఓ మైనర్ బాలికను రెండో వివాహం చేసుకోవడంతో పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... వినోద్‌కు గతంలో కనకా (30) అనే మహిళను పెళ్లి చేసుకోగా, వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయితే, వీరిద్దరూ ఐదేళ్ళగా విడిపోయారు. ఈ నేపథ్యంలో 16 యేళ్ళ బాలికను వివాహం చేసుకున్నాడు. ఈ విషయంపై స్థానికులు కొందరు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు కేసు నమోదు చేసి వినోద్‌ను అరెస్టు చేశారు.

వారాహి ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వేలూరు, ఏప్రిల్ 25: స్థానిక సేన్‌పాక్కంలో ఉన్న సంతాన ఈశ్వరి శ్రీ చక్ర మహా పీఠం మహా వారాహి ఆలయంలో లలితా సహస్రనామ అఖండ పారాయణం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో వేలూరు, కొసపేట, సత్తువాచేరి, గాంధీ నగర్ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వారాహి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. కార్యక్రమ ఏర్పాట్లను మహా వారాహి భక్తులు, ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

ముంబై సంస్థకు 14 టన్నుల ప్లాస్టిక్ వస్తువులు

వేలూరు, ఏప్రిల్ 25: కార్పొరేషన్ కమిషనర్ ఉత్తర్వులతో నగరంలో సేకరించిన ప్లాస్టిక్ వస్తువులను ముంబై, అరియలూరులోని ప్రైవేటు సంస్థలకు తరలించే పనులు గురువారం జరిగాయి. ఈ కార్యక్రమాన్ని కార్పొరేషన్ సంక్షేమ అధికారి గణేష్, శుభ్రతా అధికారి శివకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

విరుదునగర్ కాంగ్రెస్ అభ్యర్థిపై వారంలో నిర్ణయం

● హైకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్‌లో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి మాణిక్కం ఠాకూర్ ఏజెంట్ల ద్వారా ఓటర్లకు డబ్బు పంచిపెట్టారనే ఆరోపణలపై వారంలో తగు నిర్ణయాన్ని ప్రకటించనున్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు మద్రాసు హైకోర్టుకు తెలిపారు. మదురైకి చెందిన బీజేపీ నాయకుడు శశికుమార్ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేస్తూ ఓటర్లకు డబ్బులు పంచిపెట్టారని మాణిక్కం ఠాకూర్ ఏజెంట్లు కామరాజ్, శీని, కరుప్పయ్యా, పాండిపై విరుదునగర్, మదురై పోలీసుస్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయన్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ అభ్యర్థి మాణిక్కం ఠాకూర్ అనర్హుడిగా ప్రకటించాలని ఎన్నికల సంఘానికి తాను వినతి పత్రం సమర్పించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆ పిటిషన్‌పై న్యాయమూర్తులు మహాదేవన్, మహమ్మద్ సబీతో కూడిన ధర్మాసనం విచారణ జరిపిం ది. ఆ సందర్భంగా ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదులు హాజరై వారంలో తగు నిర్ణయాన్ని ప్రకటిస్తామంటూ ధర్మాసనంకు తెలిపారు.

కాంగ్రెస్‌తో మన్సూర్ అలీఖాన్ ములాఖత్



టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగైతో సమావేశమైన నటుడు మన్సూర్ అలిఖాన్

పెరంబూర్, ఏప్రిల్ 25: ఇండియా జననాయగ పులిగళ్ పార్టీ అధ్యక్షుడు, నటుడు మన్సూర్ అలిఖాన్ కాంగ్రెస్‌తో విలీనం అవ్వాలని నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు అన్నాడీఎంకేతో చర్చలు జరిపి ఆ పార్టీకి మద్దతు తెలిపిన నేపథ్యంలో, అన్నాడీఎంకే కూటమిలో సీటు కేటాయించకపోవడంతో వేలూరు నియోజకవర్గం నుంచి మన్సూర్ అలిఖాన్ ఇండిపెండెంట్‌గా పోటీచేశారు. ఈ నేపథ్యంలో, లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో, గురువారం తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వ పెరుందగైను కలసిన మన్సూర్ అలిఖాన్, తమ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయనున్నామని లేఖ అందజేశారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన అనంతరం పార్టీ అధిష్ఠానం ఈ విషయమై నిర్ణయం తీసుకుంటుందని సెల్వ పెరుందగై హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మన్సూర్ అలిఖాన్ విలేఖరులతో మాట్లాడుతూ... ప్రధాని మోదీని అరెస్ట్ చేసి తీహార్ జైలుకు తరలించిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలన్నారు. కాంగ్రెస్‌లో తమ పార్టీని విలీనం చేసేలా లేఖ అందజేశామని తెలిపారు. మొదట తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, ప్రస్తుతం మళ్లీ తన తల్లి పార్టీలో విలీనం కావాలని నిర్ణయించానని మన్సూర్ అలిఖాన్ తెలిపారు.

ప్రచారంలో ప్రజలను విభజించి మాట్లాడటం మంచిది కాదు

● బీజేపీకి మాజీ మంత్రి ఉదయకుమార్ చురక



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఉదయకుమార్

ప్యారీస్, ఏప్రిల్ 25: ఎన్నికల ప్రచారంలో కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే విధంగా బీజేపీ సీనియర్ నేత, ప్రధాన నరేంద్ర మోదీ మాట్లాడడం సరికాదని అన్నాడీఎంకే మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ వ్యాఖ్యానించారు. మదురై జిల్లా కుమరం ప్రాంతంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ఉదయకుమార్ ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఆయన ప్రకటించిన 24 గంటల్లో చోళవందాన్ నియోజకవర్గంలో ఉన్న కుమారం, అలంగానల్లూర్, వాడిపట్టి తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల రాజకీయం చేపట్టిన బీజేపీ, ప్రజలను విభజించి వారి మధ్య చిచ్చుపెట్టే కుట్ర పన్నిందని, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ప్రధాని మోదీ కూడా సంప్రదాయాన్ని విస్మరించి నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీజేపీ పెద్దలు ఎన్ని సార్లు రాష్ట్రంలో పర్యటించినా కమలం వికసించబోదని ఉదయకుమార్ పేర్కొన్నారు.

జంతువుల దాహార్తి తీర్చేందుకు నీటి కుంటలు



కుంటల్లో నీరు నింపుతున్న అటవీ శాఖ సిబ్బంది

వేలూరు, ఏప్రిల్ 25: పేర్నాంబట్టు అటవీ ప్రాంతంలో జంతువుల దాహార్తి తీర్చేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి గురుస్వామి ఆదేశం మేరకు పేర్నాంబట్టు అటవీ శాఖ అధికారి సతీష్‌కుమార్, రేంజర్ అన్నామలై, ఇళయరాజా, మాదేశ్వన్, మురళి, అటవీ భద్రతా అధికారి రవి, వెంకటేశన్, అరవింద్, తిరుమలైవానన్, పురుషోత్తమన్ తదితరులు ట్రాక్టర్ల ద్వారా కుంటల్లో నీటిని నింపుతున్నారు. వర్షాలు కురిసి అటవీ ప్రాంతాల్లోని జంతువులకు సమృద్ధిగా తాగునీరు లభ్యమయ్యే వరకు ఈ కుంటల్లో నీరు నింపుతామని అధికారులు తెలిపారు.

పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం ప్రారంభం



మూల్యాంకనంలో ఉపాధ్యాయులు

వేలూరు, ఏప్రిల్ 25: జిల్లాలో టెన్త్, ప్లస్ వన్ జవాబు పత్రాలు మూల్యాంకనం ప్రారంభమైంది. కాట్పాడిలోని సృష్టి మెట్రిక్యులేషన్ ఉన్నత పాఠశాల, గుడియాత్తం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి, కాట్పాడి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలు, గుడియాత్తం సెయింట్ జీసస్ మెట్రిక్ పాఠశాల తదితర ప్రాంతాలల్లో ప్లస్ వన్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టినట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భారీ భద్రత



స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీసు భద్రత

వేలూరు, ఏప్రిల్ 25: వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో పోలింగ్ పూర్తయిన వెంటనే ఈవీఎంలను తంథై పెరియార్ ఇంజనీరింగ్ కళాశాలకు తరలించి స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్ రూమ్ వద్ద 24 గంటలు షిఫ్ట్ పద్ధతిలో సాయుధదళ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే, పోలీసు ఉన్నతాధికారులు, ఎన్నికల అధికారులు తరచూ ఈ కేంద్రానికి వచ్చి భద్రతా పనులు పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వన్‌వేగా ఆర్బీఐ సబ్ వే

పెరంబూర్, ఏప్రిల్ 25: స్థానిక ప్యారీస్ సమీపంలోని ఆర్బీఐ సబ్ వే శుక్రవారం నుంచి మూడు నెలల పాటు వన్‌వేగా మార్చినట్లు గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రకారం, రాయపురం బ్రిడ్జి, రాజాజీ రోడ్డు నుంచి కామరాజర్ రోడ్డు వైపు వచ్చే వాహనాలు ఆర్బీఐ సబ్‌వేకు బదులుగా ఆర్బీఐ సర్వీస్ రోడ్డు, నార్త్ ఫోర్ట్ రోడ్డు, ఆర్‌ఏ మండ్రం, ముత్తుస్వామి రోడ్డు, డా.ముత్తుస్వామి బ్రిడ్జి, వాలాజా పాయింట్, ఫ్లాగ్ స్టాఫ్ రోడ్డు, వార్ మెమోరియల్ మీదుగా కామరాజర్ రోడ్డు చేరుకోవాలి. అదే సమయంలో కామరాజర్ రోడ్డు నుంచి ప్యారీస్ కార్నర్‌కు వచ్చే వాహనాలు యథావిధిగా వెళ్లవచ్చని ట్రాఫిక్ విభాగం తెలియజేసింది.

ఏడు మండలాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

పెరంబూర్, ఏప్రిల్ 25: చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఆధ్వర్యంలో ప్రధాన పైప్ లైన్ పనులు జరుగుతున్న కారణంగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని ఏడు మండలాల్లో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. స్థానిక మౌంట్ పూందమల్లి రోడ్డు (పోరూర్ జంక్షన్)లో తాగునీటి ప్రధాన పైప్‌లైన్ మార్చే పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా గురువారం రాత్రి 9 నుంచి ఈ నెల 27వ తేది రాత్రి 9 గంటల వరకు అంబత్తూర్, అన్నానగర్, తేనాంపేట, కోడండాక్కం, వలసరవాక్కం ఆలందూర్ తదితర ఏడు మండలాల్లోని కొన్ని ప్రాంతాలకు కొళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. అందువల్ల ప్రజలు రెండు రోజులకు సరిపడా నీటిని నిల్వచేసుకోవాలి. అత్యవసర సేవలకు లారీల ద్వారా నీటిని పొందగోరు వారు https://cmwssb.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవాలని, మరిన్ని వివరాలకు 044-45674567 అనే నెంబరు సంప్రదించాలని మెట్రోవాటర్ బోర్డు ఓ ప్రకటన విడుదల చేసింది.

కారు బోల్తా.. ప్రాణాలతో బయటపడిన కుటుంబం

అడయార్, ఏప్రిల్ 25: తమ సొంతూరులో జరిగే ఆలయ వేడుకలో పాల్గొనేందుకు కారులో బయలుదేరిన ఓ కుటుంబం అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడింది. అయితే, ఈ ప్రమాదంలో రష్యా వాసికి నడుము విరిగింది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ ప్రమాద వివరాలను పరిశీలలిస్తే, వేళచ్చేరికి చెందిన పవిత్రన్ (29) రాయపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈయన తన సొంతూరు నెల్లైలో జరిగిన ఆలయ వేడుకలో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి కారులో బయలుదేరారు. అయితే, ఈ కారు నియంత్రణ కోల్పోయి బోల్తా పడింది. ప్రమాదం నుంచి పవిత్రన్ కుటుంబ సభ్యులు ప్రాణాలతో బయటపడగా, రష్యాకు చెందిన మోసెస్ (54) అనే వ్యక్తి మాత్రం గాయపడ్డారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



శ్రీదేవి, భూదేవి, మహాలక్ష్మీ సమేత సారనాథస్వామి

తంజావూరు జిల్లా ఆలయాల నగరం కుంభకోణానికి పదిహేను కిలోమీటర్ల దూరంలో తిరుచ్చేరై సారనాథ పెరుమాళ్ ఆలయం అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాల్లో 15వదిగా, మహావిష్ణువు పంచ మహాలక్ష్మీ సమేతుడై భక్తులను అనుగ్రహించే ఏకైక క్షేత్రంగా భాసిల్లుతోంది. తనకు అత్యంత ప్రీతికరమైన క్షేత్రమని మహావిష్ణువే ప్రకటించిన క్షేత్రం కూడా ఇదేనని వైష్ణవపండితులు చెబుతుంటారు. తిరుమంగై ఆళ్వార్ కూడా ఈ క్షేత్రమహాత్యం గురించి మంగళాశాసనమొనర్చారు. ఈ క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి, మహాలక్ష్మి, సారనాయకి, నీలాదేవి అంటూ పంచమహాలక్ష్మీ సమేతుడైన సారనాథపెరుమాళ్ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవృక్షంలా అనుగ్రహిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై

ఆధ్యాత్మికం



మహావిష్ణువుకు ప్రీతికరం

- కోరిన వరాలిచ్చే సారనాథపెరుమాళ్ ఆలయం
- కావేరిమాత తపమాచరించిన దివ్యక్షేత్రం

పంచలక్ష్మీ సమేత శ్రీహరి క్షేత్రం

స్థలపురాణం...



సారనాథుడి పాదాలు

పూర్వం కావేరి మాత గంగానదికి లభిస్తున్న కీర్తి ప్రతిష్ఠలు తనకు కూడా కలిగేలా వరమివ్వమంటూ మహావిష్ణువును వేడుకుంటూ సార పుష్కరణి పడమటి ఒడ్డున ఘోరత పమాచరించిది. కావేరి మాత తపస్సును మెచ్చి పెరుమాళ్ పసికందు రూపంలో ఆ తల్లి వడిలో చేరారు. తనకు ఈ కీర్తి మాత్రమే సరిపోదని కావేరి తల్లి చెప్పగా గరుడవాహనంలో శంఖరు చక్రధారిగా పంచ మహాలక్ష్మీ సమేతుడై పెరుమాళ్ ప్రత్యక్షమై కావేరి నది కూడా గంగానదిలాగే అత్యంత పుణ్యప్రదమవుతుందని వరమిచ్చి ఆమెను అనుగ్రహించారు. మహావిష్ణువు మరేదైనా వరం కోరుకోమని తెలిపారు. తనకు దర్శనమిచ్చిన రూపంలోనే ఈ క్షేత్రంలో భక్తులను అనుగ్రహించాలని కావేరి మాత వేడుకుంది. పెరుమాళ్ తథాస్తు అన్నారు. కావేరి మాతను అనుగ్రహించిన క్షేత్రం కనుక ఆలయంలో మూలవిరాట్టుకు పక్కనే కావేరి మాత విగ్రహం కూడా భక్తులకు దర్శనమిస్తోంది.

కుండ కోసం బ్రహ్మదేవుడి పాట్లు...



లక్ష్మీ సమేత సారనాథస్వామి

ఆదిశేషుడిపై లక్ష్మీ సమేతుడై శయనభంగిమలో ఉన్న మహావిష్ణువు ఓ పర్యాయం సృష్టికర్త బ్రహ్మదేవుని అత్యవసరంగా పిలిచి ప్రళయకాలం ఆసన్నమవుతోందని వేదాగమ శాస్త్ర పురణాలను భద్రపరిచేందుకు భూలోకం వెళ్ళి అత్యంత సారవంతమైన మట్టితో కుండను తయారు చేయమని పురమాయించారు. మహావిష్ణువు ఆదేశానుసారం బ్రహ్మదేవుడు భూలోకంలో పలు తీర్థక్షేత్రాలకు వెళ్ళి మట్టిని సేకరించి కుండను రూపొందించడానికి చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. చివరకు మహావిష్ణువు వద్దకు వెళ్ళి తరుణోపాయం చెప్పమని బ్రహ్మదేవుడు అడిగారు. భూలోకంలో తిరుచ్చేరై ప్రాంతానికి వెళ్ళి సార పుష్కరిణి సమీపంలోని మట్టితో కుండను కూపొందించమని ఆదేశిస్తారు. బ్రహ్మదేవుడు తిరుచ్చేరై వెళ్ళి సార పుష్కరిణి ఒడ్డున మట్టితో కుండను తయారు చేసి వేద ఆగమ శాస్త్రాలను అందులో భద్రపరిచారు. ఈ స్థలంలోని మట్టి అత్యంత సారవంతమైనది కనుక ఈ క్షేత్రంలో వెలసిన పెరుమాళ్‌ను సారనాథపెరుమాళ్ అని పిలుస్తున్నారు. అదే విధంగా మహావిష్ణువు ఆవిర్భావంతో ఈ నేల మరింత శ్రేష్ఠదాయకమైందని తెలిపేలా ఈ స్థలానికి 'తిరుచ్చారం' అనే పేరొచ్చింది. ఆ పేరు కాస్త కాలగమనంలో తిరుచ్చేరైగా రూపాంతరం చెంది స్థిరపడింది.

ఆలయ వైభవం...

ఈ ఆలయం వెయ్యేళ్లనాటిదని పురావస్తు పరిశోధకులు నిర్ధారించారు. 380 అడుగుల పొడవు, 234 అడుగుల వెడల్పు కలిగిన స్థలంలో నిర్మితమైన ఈ ఆలయం తూర్పుదిశలో ఉన్న రాజగోపురం 90 అడుగుల ఎత్తులో ఉంది. ఈ ఆలయ విమానానికి సార విమానం అని పేరు. ఆలయానికి ముందు సార పుష్కరిణి అనే తీర్థకొలను ఉంది. ఈ సార పుష్కరిణికి పడమటి ఒడ్డున అగస్త్య మహర్షి, బ్రహ్మ, కావేరి మాత ప్రత్యేక సన్నిధుల్లో పూజలందుకుంటున్నారు. ఆలయ అంతర ప్రాకారంలో శ్రీనివాసపెరుమాళ్, నమ్మాళ్వార్, ఉడయార్, కూరత్తాళ్వార్, శ్రీరామచంద్రమూర్తి, ఆంజనేయస్వామి, రాజగోపాలుడు, ఆండాళ్, సత్యభామ, రుక్మిణి, నరసింహస్వామి, బాలసారనాథర్‌కు ప్రత్యేక సన్నిధులున్నాయి. మూలస్థానంలో పెరుమాళ్‌కు కుడివైపున మార్కండేయుడు కొలువుదీరి ఉన్నారు. ఓ పర్యాయం ఉప్పిలియప్పన్ ఆలయంలో మార్కండేయ మహర్షి కుమార్తె భూదేవిని పరిణయమాడాలని పెరుమాళ్ భావించారు. ఆ విషయాన్ని మార్కండేయ మహర్షికి తెలుపగానే తన కుమార్తె వంటల్లో ఎంత ఉప్పు వేయాలో కూడా తెలియని అమాయకురాలని చెబుతారు. మార్కండేయ మహర్షి కుమార్తె లవణ రహితంగా చేసే వంటకాలను తాను ఆరగిస్తానని పెరుమాళ్ చెప్పడంతో మార్కండేయ మహర్షి ఆ వివాహానికి సమ్మతిస్తారు. అప్పటి నుండి పెరుమాళ్‌కు ఉప్పిలియప్పన్ అనే పేరొచ్చింది. మహావిష్ణువుకే కుమార్తెనిచ్చి వివాహం చేసి కీర్తి గడించిన మార్కండేయ మహర్షి అంత్యకాలంలో తిరుచ్చేరైలోనే ముక్తిని పొందటం విశేషం.



మహాలక్ష్మి



ఆలయ ప్రవేశద్వారం



సార పుష్కరిణి

ఆలయవిశేషాలు..

ఈ ఆలయంలో ప్రతియేటా తైపూస ఉత్సవాలు పది రోజులపాటు అత్యంత వైభవంగా జరుగతాయి. పదో రోజు స్వామివారు మహారథంలో ఊరేగి భక్తులను అనుగ్రహిస్తారు. తై నెల పూస నక్షత్ర గురువార పర్వదినాన మహావిష్ణువు కావేరి మాతకు దర్శనమివ్వడంతో 12 యేళ్లకొకమారు వచ్చే ఆ పర్వదినాన సార పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తారు. ఈ క్షేత్రంలోని స్వామివారిని దర్శిస్తే వందసార్లు కావేరి నదిలో స్నానమాచరిస్తే వచ్చే పుణ్యఫలాలు దక్కుతాయని వైష్ణవ పండితులు చెబుతారు. ప్రతిరోజూ ఈ ఆలయాన్ని ఉదయం 6 నుండి 11 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 5 నుండి రాత్రి 8 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఎలా వెళ్ళాలి?..

రాష్ట్రంలోని చెన్నై సహా పలు నగరాల నుంచి కుంభకోణం నగరానికి ప్రభుత్వ రవాణా సంస్థ, ఆమ్నీ సంస్థ బస్సులు నడుపుతున్నాయి. కుంభకోణం చేరుకున్న తర్వాత అక్కడికి 14కి.మీ. దూరంలో ఉన్న తిరుచ్చేరైకి టౌన్ బస్సులు, టాక్సీలు, ఆటోల్లో వెళ్ళవచ్చు.

స్వామివారి నామధేయం : సారనాథర్
అమ్మవారి నామధేయం : సారనాయకి - పంచలక్ష్మి
తీర్థం : సార పుష్కరిణి - విమానం : సార విమానం.

రాజగోపాలుడి వేషంలో అనుగ్రహం..

ఓ పర్యాయం అళగియ మనవాళ నాయక రాజు మన్నార్‌గుడిలోని రాజగోపాలస్వామి తలయంలో జీర్ణోద్ధరణ పనులు చేయ తలపెట్టారు. ఆ మేరకు అవసరమైన సామగ్రిని బండ్లలో తిరుచ్చేరై మీదుగా మన్నార్‌గుడికి పంపారు. ఆ సమయంలో తిరుచ్చేరైకి చెందిన నరసభూపాలుడు అనే వ్యక్తి మన్నార్‌గుడికి బండ్లలో తరలిస్తున్న సామగ్రిలో కొన్ని రాతిస్తంభాలను అపహరించి తిరుచ్చేరై ఆలయం వద్దకు తరలిస్తాడు. ఈ విషయం తెలుసుకున్న మనవాళ నాయక రాజు విచారణ జరిపేందుకు తిరుచ్చేరైకి బయలుదేరారు. ఈ సమాచారం విని నరసభూపాలుడు తనను కాపాడమంటూ పెరుమాళ్‌ను వేడుకున్నాడు. తనను ఆశ్రయించిన వీరభక్తుడు నరసభూపాలుడిని కాపాడేందుకు సారనాథపెరుమాళ్ మనవాళ నాయకరాజు ఎదుట మన్నార్‌గుడి రాజగోపాలుడి వేషధారణలో ప్రత్యక్షమై అనుగ్రహించారు. రాజు సంతోసించి నరసభూపాలుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా తిరుచ్చేరై ఆలయానికి జీర్ణోద్ధరణ పనులు కూడా చేపట్టారు.



మూలవిరాట్టు - ఆలయధ్వజస్తంభం

1న అజిత్ బ్లాక్‌బస్టర్

'బిల్లా' రీ రిలీజ్



'బిల్లా'లో అజిత్ కుమార్

అగ్రహీరో అజిత్ కుమార్ నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో 'బిల్లా' ఒకటి. ఈ చిత్రాన్ని మే ఒకటో తేదీన రీ-రిలీజ్ చేయనున్నారు. స్లీక్ అండ్ స్టైలిష్‌గా కనిపించి, యాక్షన్ హీరోగా ఈ చిత్రంలో అజిత్ కుమార్ అదరగొట్టారు. విష్ణువర్ధన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం టాక్ పరంగానే కాకుండా వసూళ్ళపరంగా హిట్ మూవీగా నిలిచింది. ఈ సినిమా విడుదలై 17 ఏళ్లు గడిచినా ఈ చిత్రం గురించి ఏకే అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు కూడా ఇప్పటికీ మాట్లాడుకుంటున్నారు. ఈ సినిమాను మళ్ళీమళ్ళీ చూసేందుకు కూడా అమితాసక్తి కనబరుస్తున్నారు. జీపీ ఎంటర్‌టైన్మెంట్ సురేష్ కుమార్, డాక్టర్ జ్ఞానభారతి కలిసి ఈ సినిమాను మే ఒకటో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 150కి పైగా స్క్రీన్లలో రీ రిలీజ్ చేసేలా ప్లాన్ చేశారు. విష్ణువర్ధన్ స్టైలిష్ మేకింగ్‌లో వచ్చిన ఈ మూవీలో అజిత్ కుమార్ ద్విపాత్రిభినయం చేయగా, నయనతార హీరోయిన్. నీరవ్ షా కెమెరా పనితనం యువన్ శంకర్ రాజా సంగీతం ఈ సినిమా విజయంలో కీలకపాత్ర పోషించాయి.



వీరాభిమాని కుటుంబసభ్యులతో జయం రవి

అభిమాని కుటుంబానికి

జయం రవి పరామర్శ

అనారోగ్యంతో మృతి చెందిన తన వీరాభిమాని కుటుంబాన్ని హీరో జయం రవి కలుసుకుని పరామర్శించారు. స్థానిక ఎంజీఆర్ నగర్‌కు చెందిన రాజా (30) అనే అభిమాని అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న హీరో జయం రవి... మృతుడి ఇంటికి వెళ్ళి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముఖ్యంగా మృతుడి భార్య, కుమార్తెను ఓదార్చి, తాను అండగా ఉంటానని, రాజా కుటుంబానికి ఎలాంటి అవసరమొచ్చినా సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, రాజా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

చిత్రజ్యోతి

'గోట్' ప్రత్యేక గీతంలో శ్రీలీల?

వెంకట్ ప్రభు దర్శకత్వంలో హీరో విజయ్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (గోట్) చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో ఒక ప్రత్యేక గీతంలో టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల నటింపజేసేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఏజీఎస్ నిర్మాణ సంస్థ నిర్మించే ఈ చిత్రం స్టోరీ... మాస్కో బ్యాక్‌గ్రౌండ్‌లో జరిగే స్టోరీ కావడంతో రష్యాలో సినిమా షూటింగ్ జరుపుకుంటుంది. ప్రస్తుతం క్లైమాక్స్ షూటింగ్ జరుగుతుంది. వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు 5వ తేదీన విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో విజయ్ సరసన మీనాక్షి చౌదరి నటిస్తుండగా ఇతర పాత్రల్లో స్నేహ, లైలా, మోహన్, ప్రశాంత్, ప్రభుదేవా, అజ్మల్, నితిన్ సత్య, వైభవ్, ప్రేమ్‌జీ, పార్వతి నాయర్ తదితరులు పోషిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న ఈ మూవీలో హీరోతో పాటు విలన్ కూడా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. అయితే, ఇందులోని ఒక ప్రత్యేక గీతం(ఐటమ్ సాంగ్)ను మొదట త్రిషతో చేయించాలని ప్లాన్ చేశారు. కానీ, ఇపుడు తెలుగు యంగ్ హీరోయిన్ శ్రీలీలను తీసుకోవాలని నిర్ణయించి, ఆమెను సంప్రదిస్తున్నట్టు సమాచారం. అయితే, నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటన చేయాల్సివుంది.



మందిరమూర్తి దర్శకత్వంలో గోపురం ఫిలిమ్స్ చిత్రం



సుష్మిత, అన్బుచెళియన్, మందిరమూర్తి తదితరులు

బడా నిర్మాత, సినీ ఫైనాన్షియర్, గోపురం ఫిలిమ్స్ అధినేత అన్బుచెళియన్ చాలా కాలం తర్వాత ఓ చిత్రానికి ప్లాన్ చేశారు. గత యేడాది 'అయోద్ధి' చిత్రంతో సూపర్ హిట్ చిత్రాన్ని రూపొందించిన కొత్త దర్శకుడు మందిరమూర్తి దర్శకత్వంలో ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ విషయాన్ని నిర్మాత అన్బుచెళియన్ అధికారికంగా వెల్లడించారు. ఈ చిత్రానికి అన్బుచెళియన్ కుమార్తె సుష్మిత చెళియన్ నిర్మాతగా వ్యవహరించనున్నారు. అయితే, ఇందులో నటించే నటీనటులు, టెక్నీషియన్లతో పాటు ఈ సినిమా కథాంశం, జానర్ తదితర అంశాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. కాగా, గోపురం ఫిలిమ్స్ బ్యానరుపై గతంలో 'ఆండవన్ కట్టలై', 'మరుదు', 'తంగమగన్' వంటి పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించింది. అదేవిధంగా మందిర మూర్తి తెరకెక్కించిన 'అయోద్ధి' చిత్రం వచ్చి ఒక యేడాది గడిచిపోయింది. ఆ తర్వాత ఆయన ఒక్క చిత్రానికి కూడా కమిట్ కాలేదు. ఈ క్రమంలో గోపురం ఫిలిమ్స్ ఒక కొత్త చిత్రాన్ని నిర్మించనున్నట్టు ప్రకటించింది.

హెచ్ఐఎస్‌లో 'తమిళనాడు కేంబ్రిడ్జి ప్రిన్సిపల్స్ మీట్-2024'



సమావేశంలో విద్యావేత్తలు

అడయార్, ఏప్రిల్ 25: నగరంలోని హిందుస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అనుబంధ విద్యా సంస్థల్లో ఒకటైన హిందుస్థాన్ ఇంటర్నేషనల్ స్కూల్ 'తమిళనాడు కేంబ్రిడ్జి ప్రిన్సిపల్స్ మీట్ -2024'ను నిర్వహించింది. స్థానిక గిండి ప్రాంగణంలో ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌ను నిర్వహించింది. ఇందులో కేంబ్రిడ్జి అసెస్‌మెంట్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సౌత్ ఇండియా మేనేజర్ అను లక్ష్మణ్, సౌత్ ఇండియా అకడమిక్ అడ్వైజర్ కత్రినా మన్, ది ఇండియన్ పబ్లిక్ స్కూల్ చీఫ్ అకడమిక్ ఆఫీసర్ డాక్టర్ సోనాలి గీడ్, వివేకాలయ డైరెక్టర్ ఐశ్వర్య రావు వంటి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. హెచ్ఐఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీకే లిల్లి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మిట్‌లో హెచ్ఐఎస్ అకడమిక్స్ డీన్ జాన్సన్ మ్యాథ్యూ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 70 మందికిపైగా స్కూళ్లకు చెందిన ప్రిన్సిపాల్స్ ఇందులో పాల్గొని, విద్యలో సహకారం, జ్ఞానాన్ని పంచుకోవడం వంటి ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. 'భవిష్యత్ కోసం అభ్యాసకుల సాధికారత' అనే అంశంపై ప్యానెల్ డిస్కషన్ జరిగింది. ఇందులో ఆరుగురు నిష్ణాతులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ ప్యానెల్ జాబితాలో ఏపీల్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరిజా సంతోష్, లాలాజీ మెమోరియల్ ఓమేగా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ భవానీ మూర్తి, అక్షర్ అర్బాల్ ఇంటర్నేషనల్ స్కూల్ హెడ్ ఆఫ్ స్కూల్ ప్రియా దీక్షిత్, వికాస్ స్కూల్ ప్రిన్సిపాల్ మురళి, లాలాజీ ఓమేగా ఇంటర్నేషనల్ స్కూల్ స్ట్రాటజిక్ రిలేషన్‌షిప్ హెడ్ దివ్య రాజగోపాలన్ ఉన్నారు. వినూత్న బోధనా పద్ధతులు, సమగ్ర పాఠ్యాంశాలను ఉపయోగించడం ద్వారా ఈ పాఠశాలలను వేగవంతమైన ప్రపంచంలో విజయం సాధించడానికి అభ్యాసకులను సిద్ధం చేయడమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.


కన్నియాకుమారిలో గుహన్ బోట్ ట్రయల్ రన్



తిరువళ్ళువర్ విగ్రహప్రాంతానికి వెళుతున్న గుహన్ బోట్

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో పూంపుహార్ సంస్థ నడుపుతున్న మూడు బోట్లలో ఒకటైన గుహన్ బోట్ ట్రయల్ రన్ గురువారం ఉదయం జరిగింది. కన్నియాకుమారి సముద్రతీర ప్రాంతంలో ఉన్న వివేకానంద స్మారక మండపం, తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతానికి పొదిగై, గుహన్, వివేకానంద పేర్లతో మూడు బోట్లను పూంపుహార్ సంస్థ నడుపుతోంది. ఈ నేపథ్యంలో మూడు బోట్లలో ఒకటైన గుహన్ రిపేరు కావటంతో ఫిబ్రవరి 15న దానిని చిన్నముట్టం షిప్పింగ్ యార్డ్‌కు తరలించారు. రెండు నెలల పాటు ఆ బోట్ మరమ్మతులు జరిగాయి. ఈ నెల 15న కొత్త రూపు సంతరించుకున్న గుహన్ బోట్‌ను చిన్నముట్టం షిప్పింగ్ యార్డు నుంచి కన్నియాకుమారి వివేకానంద స్మారక మండపం సమీపంలో ఉన్న బోట్‌సవారీ కేంద్రానికి తరలించారు. ఆ తర్వాత చెన్నై నుంచి వచ్చిన ఇంజనీర్లు, పూంపుహార్ సంస్థ అధికారులు గుహన్ బోట్‌ను వివేకానంద స్మారక మండపం, తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతం వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ బోట్ పనితీరు సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఇక రోజూ ఆ బోట్‌ను పర్యాటకుల కోసం ఉపయోగించవచ్చని చెన్నై ఇంజనీరింగ్ నిపుణులు కూడా ప్రకటించారు. దీంతో శనివారం నుంచి ఈ బోట్ మళ్ళీ యథావిధిగా పొదిగై, వివేకానంద బోట్లతోపాటు పర్యాటకులకు సేవలందించనుందని అధికారులు పేర్కొన్నారు.

ఐసిఎఫ్‌ను సందర్శించిన రైల్వే బోర్డు అదనపు సభ్యుడు



పంకజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐసిఎఫ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

ప్యారీస్, ఏప్రిల్ 25: స్థానిక పెరంబూర్ సమీపంలో ఉన్న ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్)ను రైల్వే బోర్డు అదనపు సభ్యుడు (ప్రొడక్షన్ యూనిట్లు) ఎస్కే పంకజ్ గురువారం సందర్శించారు. ఆయనకు ఐసిఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు, ఇతర విభాగాల అధిపతులు, కార్మిక సంఘం ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ఐసిఎఫ్‌లో తయారవుతున్న వందే భారత్ కోచ్‌లు, వందే మెట్రో, ఆఫీస్ ఆన్ వీల్స్, ఇతర కోచ్‌లను పంకజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఐసిఎఫ్ వర్క్‌షాప్, సేల్ డివిజన్‌లోని బుగ్గ దుకాణాన్ని కూడా ఆయన పరిశీలించారు. జనరల్ మేనేజర్ సుబ్బారావు, ఇతర అధికారులు సమావేశమై, ఐసిఎఫ్‌లో తయారవుతున్న రైలు బోగీలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఐసిఎఫ్ కార్మిక సంఘం ప్రతినిధుల నుంచి వినతిపత్రం స్వీకరించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా స్వామినాథుడి రథోత్సవం

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం స్వామిమలై స్వామినాథస్వామి ఆలయ చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరుదివ్యక్షేత్రాల్లో నాలుగో క్షేత్రంగా పేరొందిన స్వామిమలైలో స్వామివారికి ప్రతినెలా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. వాటిలో చిత్తిరై బ్రహ్మోత్సవాలు ప్రసిద్ధి చెందాయి. ఆ మేరకు ఈ ఆలయంలో చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఈ నెల 17న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్వామివారు వివిధ వాహనాల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన రథోత్సవం గురువారం ఉదయం ప్రారంభమైంది. ముందుగా వళ్ళి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారు సర్వాలంకరణ శోభితులై రథంపై అమర్చిన ప్రత్యేక పీఠం ఆశీనులయ్యారు. ఆ తర్వాత వేలాదిమంది భక్తులు రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్లను పట్టుకుని 'హరోం హరా..! మురుగయ్యా' అంటూ నినాదాలు చేస్తూ లాగారు. ఈ రథోత్సవం స్వామిమలై రథం వీదుల మీదుగా కొనసాగింది. ఈ వేడుకలలో భక్తులకు సుమారు రెండు వందలమంది పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్థానికులు మజ్జిగ, పానకం తదితర పానీయాలను పంపిణీ చేశారు. పలు భక్త మండళ్ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు కూడా జరిగాయి. శుక్రవారం స్వామివారు రజత మయూర వాహనంలో ఊరేగనున్నారు. ఆ తర్వాత కావేరిలో జరిగే తీర్థవారీతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.



అన్న ఫోనంటే హడల్!



ఇదీ మందు


"అన్నా.. బాగుండారు గదా.. గెలవబోయేది మళ్లీ మనమే. మనం కోరుకున్నది చేసుకోవచ్చు. ఎలక్షను ఖర్చులు బాగా పెరిగిపోయినాయని తెలుసుకదా. మనోడు వొచ్చి కలుస్తాడు. మరిచిపోబాకండి" అంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వ్యాపారులకు ఫోన్‌లు వస్తున్నాయి. అయిదేళ్లుగా అధికార పార్టీ దందాలు కళ్లజూసిన వీరు ఇటువంటి ఫోన్ రాగానే హడలిపోతున్నారు. మొబైల్ మోగగానే ఎక్కడి నుంచా అని ఆందోళనగా చూస్తున్నారు. నాయకుడి అసలు నెంబరు నుంచి గాక ప్రతిసారీ ఏదో కొత్త నెంబరు నుంచే ఫోన్‌లు వస్తున్నాయి. అడిగినంత ఇచ్చుకోలేక. అలా అని ఇవ్వకపోతే ఏమవుతుందో అనే భయం వదులుకోలేక వ్యాపారులు ఆందోళనపడుతున్నారు. 'ఇసుకలో బానే ఎనకేసుకున్నారు గదా. భూములు, పంచాయతీలు అని కోట్లు సంపాయిస్తిరి.. ఇప్పుడు మళ్లీ మనమింద పడ్డారేంది స్వామీ' అని ఒకరికొకరు కలబోసుకుని కడుపు చించుకుంటున్నారు.

- రేణిగుంట

రాష్ట్ర మంత్రి రోజా ఎక్కే గడప దిగే గడపతో సతమతమవుతున్నారు. పుత్తూరుకు చెందిన వైసీపీ కీలకనాయకుడు ఏలుమలై మొదలియార్ టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆమె అలెర్ట్ అయ్యారు. అసమ్మతి వర్గ నేతల పట్ల ఇప్పటిదాకా ఉన్న బింకాన్ని సడలించుకుని వారి ఇళ్లకు తిరుగుతున్నారు. ఏలుమలై మొదలియార్ వర్గంకే చెందిన వైసీపీ నాయకుడు నారాయణబాబు ఇంటికి వెళ్లి తనకు సహకరించాలని రోజా కోరారు. అలాగే విజయపురం మండలంకు చెందిన అసమ్మతి నాయకుడు లక్ష్మీపతిరాజును కలిసేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. బుధవారం నగరి మున్సిపాలిటీకి చెందిన మొదలియార్ సామాజికవర్గంలో కీలక నాయకుడు పురుషోత్తం మొదలియార్‌ను ఆయన ఇంట్లోనే కలిశారు. అదే రోజు మధ్యాహ్నం నగరి మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్ ఇంటి గడప తొక్కారు. 'ఇప్పటి వరకు జరిగిందేదో జరిగిపోయింది...ఈ ఎన్నికల్లో నాకు సహకరించండి' అంటూ వారందరినీ కోరుతున్నట్లు సమాచారం. అయితే వెళ్లిన ప్రతిచోటా సానుకూలత లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నట్లు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. రెండు వారాల క్రితం తిరుపతిలో శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డి వారి చక్రపాణిరెడ్డిని కలిసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారని తెలిసింది. 'జరగాల్సిన నష్టం జరిగిపోయాక ఇప్పుడు గడప గడపకు తిరిగి లాభం ఏమిటి' అనే నిట్టూర్పులు వైసీపీలోనే వినిపిస్తుండడం విశేషం.

- పుత్తూరు అర్బన్

ఎక్కే గడప ... దిగే గడప!



జన కేతనం

ఖాతాల్లో జమ కాని విద్యాదీవెన, వసతి దీవెన సొమ్ము

విద్యా సంవత్సరం ముగుస్తోందని విద్యార్థుల ఆందోళన

అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్న తల్లిదండ్రులు


జగన్ మాటలకు మోసపోయామంటూ లబోదిబో

మీ బిడ్డల చదువుల విషయం నాకొదిలేయండి. జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో పెద్ద చదువులు చదివించండి.

- విద్యార్థుల తల్లిదండ్రులకు సీఎం జగన్ తరచూ చెప్పే మాటలివి

రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని సీఎం జగన్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇందుకు విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను క్రమం తప్పకుండా అమలుచేస్తున్నామంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆయన పచ్చి అబద్ధాలు చెబుతున్నారని అర్థం అవుతుంది. విద్యాదీవెన పథకంలో ప్రారంభ సంవత్సరం నుంచి పలు అంశాలను సాంకేతిక కారణాల సాకుగా చూపుతూ లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తూ వచ్చారు. అఖరు సంవత్సరానికి మొత్తం చేతులెత్తేశారు.

- తిరుపతి(కలెక్టరేట్)



బటన్ నొక్కి రెండు నెలలు..

డబ్బులేవి జగన్ మామూ..!

పేద విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలల్లో రూపాయి కూడా ఫీజు రూపంలో చెల్లించాల్సిన పని లేదని, అంతా ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చిన జగన్ ఆచరణలో విద్యార్థుల నడ్డివిరిచారు. విద్యాదీవెన, వసతి దీవెన కింద ఆర్థిక సాయాన్ని జమ చేయడానికి ఆయన బటన్ నొక్కి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ కాలేదు. ఐదేళ్లుగా పథకాలకు నిధులు సక్రమంగా విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విద్యాసంవత్సర త్రైమాసికానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఈఏడాది మార్చి 1న ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ ఫోటో ఫోజులిచ్చి నమూనా చెక్కులు విడుదల చేశారే తప్ప డబ్బులు జమయ్యాయా లేదో తెలుసుకోలేదు. ఈ విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నా పథకాల సొమ్ము అందలేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఫార్మశీ కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లిస్తేనే వార్షిక పరీక్షలకు అనుమతిస్తామంటున్నాయి. దీంతో అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

జిల్లాలో కాకిలెక్కలు

జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు వసతి దీవెన కింద రూ.188.92 కోట్లు, విద్యాదీవెన కింద రూ.475.23 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు కాకి లెక్కలు చెబుతున్నారు. క్షేత్రస్థాయికి వచ్చే సరికి తల్లిదండ్రుల ఖాతాల్లో చాలా వరకు నగదు జమ కాలేదు. ఇక చివరకు ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి 39,368 మంది విద్యార్థులకు రూ.29.50కోట్లు జమ చేస్తున్నట్లు ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. కానీ తమకు అందలేదని విద్యార్థులూ, తల్లిదండ్రులూ చెబుతున్నారు.

అప్పు చేసి సర్టిఫికెట్లు తీసుకున్నాం



అప్పు చేసి రూ.56 వేలు ఫీజు కడితే సర్టిఫికెట్లు ఇచ్చారు. పుత్తూరులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం కూడా పూర్తయింది. విద్యాదీవెన రాలేదు. అధికారులను అడిగితే తెలియదన్నారు. ఫీజు కడితే కానీ సర్టిఫికెట్లు ఇవ్వమని కళాశాల యాజమాన్యం చెప్పింది. చేసేది లేక మా తల్లిదండ్రులు అప్పు చేశారు. మాలాంటి పేదవారిపట్ల ప్రభుత్వం ఇలాగేనా ప్రవర్తించేది.

- వై.లోకేష్(బీటెక్), ఆర్‌సీపురం

డబ్బులు రాని బటన్ నొక్కడం ఎందుకు



అధికారంలోకి వస్తానే విద్యావ్యవస్థకు పెద్దపీట వేసి పేద విద్యార్థులకు సొంత మామయ్యలా అండగా ఉంటానని సీఎం జగన్‌రెడ్డి డాంబికాలు పలికారు. ఉత్తిత్తి బటన్లు నొక్కుతున్నారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నా తల్లిదండ్రుల ఖాతాల్లో పైసా కూడా జమ కాకపోవడం దుర్మార్గం. ముమ్మాటికీ ప్రభుత్వం మోసం చేసినట్లే.

- ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం మోసం చేసింది

మా తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లేవారు. లేకపోతే పూటగడవదు. ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదివినప్పుడు విద్యాదీవెన కింద ప్రభుత్వం రూ.8వేలు ఖాతాలో వేసింది. ఇపుడు డిగ్రీ పూర్తవుతోంది. ఇంత వరకూ ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ఎలా ఫీజు కట్టేది. ప్రభుత్వం మమ్మల్ని మోసం చేయడం కరెక్టేనా.



- వినయ్, మిట్టగాంధీ పురం, తిరుపతి రూరల్

ఒక విడత కూడా అందలేదు

విద్యాదీవెన ఆసరాగా ఉంటుందని ఓ ప్రైవేటు కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సులో చేరాను. ప్రభుత్వం ఇచ్చే రీయింబర్స్‌మెంట్ చదువుకు ఉపయోగపడుతుందనుకున్నా. విద్యాదీవెన ద్వారా ఇప్పటి వరకు ఒక విడత కూడా సాయం అందలేదు. అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నా. విద్యా దీవెన ఎప్పటికొస్తుందో అర్థం కాకుండా ఉంది.

- వంశీకృష్ణ, చిల్లకూరు





ఇంకా జమకాలేదు

నేను తిరుపతిలోని ఓప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాను. జగన్ మామయ్య బటన్ నొక్కి రెండు నెలలవుతోంది. ఇప్పటికీ రూపాయి కూడా జమకాలేదు. విద్యాసంవత్సరం కూడా ముగుస్తోంది. డబ్బులు ఎపుడు వస్తాయో తెలియని పరిస్థితి.


- విశాల్, తిరుపతి రూరల్

మోసం గురూ!

టీడీపీకి పెట్టని కోట

1983 తరువాత ఆరుసార్లు గెలిచిన తెలుగుదేశం

రెండుసార్లు మాత్రమే కాంగ్రెస్ విజయం



సత్యవేడు,ఏప్రిల్ 24: టీడీపీకి సత్యవేడు నియోజకవర్గం పెట్టని కోట. 1983లో ఆ పార్టీ ఆవిర్భవించాక వరుసగా టీడీపీ విజయదుందుభి మోగిస్తోంది. కేవలం రెండు సార్లు మాత్రమే కాంగ్రెస్ గెలవగలిగింది. తమిళనాడు సరిహద్దులోని ఈ నియోజకవర్గం 1961కు ముందు ఆ రాష్ట్రంలోని నాటి చెంగల్‌పట్టు జిల్లా తిరువళ్ళూరు తాలూకాలో అంతర్భాగంగా ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా పటాస్కర్ అవార్డు ప్రకారం 1962 ఏప్రిల్ 2న ఆంధ్రప్రదేశ్‌లో కలిసింది. తొలుత ఏడు మండలాలుండేవి. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా తొట్టంబేడు, పెళ్ళకూరు మండలాలను దీని నుంచి వేరు చేశారు. నారాయణవనం, కేవీబీపురం మండలాలను కలిపారు. ఇప్పటి వరకూ అత్యధికంగా ఆరుసార్లు టీడీపీ గెలుపొందింది. ఐదుసార్లు కాంగ్రెస్ గెలుపొందింది. 1978 ఎన్నికల వరకూ ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయకేతనం గెలవగా తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం తర్వాత పరిస్థితి తారుమారు అయింది. టీడీపీ హవా కొనసాగించింది. కాంగ్రెస్ రెండుసార్లు మాత్రమే గెలిచింది. 1978లో గెలుపొందిన సీ.దాస్, 1999లో ఎన్నికైన ఎన్.శివప్రసాద్ మాత్రమే మంత్రులుగా పనిచేశారు.

సత్యవేడు చరిత్ర

ఎప్పుడు ఆవిర్భవించింది : 1962

ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది: 13

నియోజకవర్గంలో మండలాలు:

సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీపురం.

ఎమ్మెల్యేలు

1962	టి.బాలక్రిష్ణయ్య	కాంగ్రెస్
1967	కె.మునస్వామి	స్వతంత్ర
1972	సి.దాస్	కాంగ్రెస్
1978	సి.దాస్	కాంగ్రెస్
1983	తలారి మనోహర్	టీడీపీ
1985	ఎం.సురాజ్	టీడీపీ
1989	సి.దాస్	కాంగ్రెస్
1994	ఎం.సురాజ్	టీడీపీ
1999	ఎన్.శివప్రసాద్	టీడీపీ
2004	కె.నారాయణస్వామి	కాంగ్రెస్
2009	హెచ్.హేమలత	టీడీపీ
2014	తలారి ఆదిత్య	టీడీపీ
2019	కోనేటి ఆదిమూలం	వైసీపీ

ఓటర్ల వివరాలు

మొత్తం : 2,11,378

పురుషులు : 1,02,568

మహిళలు : 1,08,797

ఇతరులు : 13

వైసీపీ నేతల చెరలో చెరువులు

● రూపాయి చెల్లించకుండా అక్రమార్జన

అధికారం అడ్డం పెట్టుకుని వైసీపీ నాయకులు చేస్తున్న అక్రమాలు అన్నీఇన్నీ కావు. ప్రశ్నిస్తే ఏం జరుగుతుందోనని ప్రజలు మౌనంగా భరిస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మండల పరిధిలో పంచాయతీ చెరువులను అధికార పార్టీ నేతలు గుప్పెట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి చెల్లించకుండా దర్జాగా చెరువుల్లోని చేపలను అమ్ముకుంటున్నారు. లక్షల్లో వెనకేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మండల పరిధిలో పంచాయతీ, సొసైటీ చెరువులు 52 ఉన్నాయి. ఇందులో పంచాయతీ ఆధీనంలో 19 పెద్ద చెరువులున్నాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి సంవత్సరం వేలం పాట నిర్వహించారు. తరువాత 2020 కరోనా రావడంతో 2021లో గతంలో పాడిన వారికి నష్టాలు చూపుతూ కొనసాగించారు. ఆ తరువాత నుంచి గామాల్లోని వైసీపీ నేతలు చెరువుల వేలం జరగనివ్వకుండా సిండికేట్ అయిపోతున్నారు. సాధారణంగా గత పాట ధరకు ప్రతి ఏటా పదిశాతం పెంచాల్సి ఉంది. వైసీపీ నేతల ఒత్తిడితో ఐదు శాతం మాత్రం పెంచుకుని 19 చెరువులనూ దక్కించుకున్నారు. ఎలమండ్యం, ఆర్ మల్లవరం, కరకంబాడీ, వెదళ్ల, అనుగుంట, చీరాలమ్మ, అత్తూరు, గాజులమండ్యం, తూకివాకం, కోట్ర మంగళం, జీపాళెం, ఆంనేయపురం, రాఘవపురం చెరువులకు ఇప్పటి వరకు రూపాయి చెల్లించలేదు. గత ఏడాది పాడుకున్న తుమ్మలగుంట, లక్షమాక చెరువులకు సైతం పైసా చెల్లించలేదు. రేణిగుంట మండల పరిధిలోని మత్స్యకార శాఖ ఆధీనంలోని 33 సొసైటీ చెరువులను సొసైటీ సభ్యుల పేరుతో వైసీపీ నేతల బినామీల అతి తక్కువ ధరతో దక్కించుకుంటున్నారని సమాచారం. ఇప్పటికీ ప్రతి వారంలో రెండుసార్లు చెరువులో చేపలను పట్టి దర్జాగా బహిరంగ మార్కెట్లో విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు.



వైసీపీ నేతల ఆధీనంలో ఉన్న వెంకటాపుం పెద్దచెరువు

- రేణిగుంట

నోట్ దిస్ పాయింట్

ప్రచారంలో గీత దాటితే..

నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ఈ సందట్లో పార్టీలూ కార్యకర్తలూ నిబంధనలు మరచిపోయి అత్యుత్సాహంతో ప్రవర్తిస్తుంటారు. ఎన్నికల సంఘం ప్రచారాలకు స్పష్టమైన గీత గీసింది. ఆ నిబంధనలు ఇవీ...

- వెంకటగిరి/దక్కిలి

- ప్రచార వాహనాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. అనుమతి పత్రాన్ని వాహనానికి అతికించాలి. వాహనాన్ని అనుమతి పొందిన అభ్యర్థే వాడాలి. ఇతరులు వాడితే చర్యలు తీసుకుంటారు.
- విద్యాసంస్థల్లో, వాటి మైదానాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు.
- కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా కచ్చితంగా ఉండాలి
- ప్రచారంలో టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు, వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ధరించే దుస్తులు మాత్రం ఇవ్వకూడదు.
- దేవుళ్ల ఫోటోలు, అభ్యర్థి ఫోటోతో కలిపి డైరీలు, క్యాలెండర్లు ప్రచురించకూడదు. వాహనాలపై కూడా మతపరమైన ఫోటోలు, అభ్యర్థి ఫొటోలు ఉండకూడదు.
- ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు, పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల తాత్కాలిక కార్యాలయాలు ఉండకూడదు.
- రాత్రి 10 గంటల తర్వాత, ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు.
- ఏజెంట్ సంబంధిత పోలింగ్ బూత్ పరిధిలో ఓటరై ఉండాలి.
- ఊరేగింపు రూటును ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.
- దిష్టి బొమ్మలు తగల బెట్టకూడదు.



విశేషం

'పేట' హ్యాట్రిక్ వీరుడు



మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పిట్ల వెంకటసుబ్బయ్య

సూళ్లూరుపేట హ్యాట్రిక్ వీరుడిగా పిట్ల వెంకటసుబ్బయ్యను అందరూ తలచుకుంటారు. పదహారేళ్ల ఎమ్మెల్యేగా చేసిన ఆయన పించను మీద ఆధారపడే చివరిదాకా జీవించారు. 1962లో సూళ్లూరుపేట నియోజకవర్గం ఏర్పడింది. 1967లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పిట్ల వెంకటసుబ్బయ్య పోటీ చేసి, తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి మేర్లపాక మునస్వామిపై 1853 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1972 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసిన కటారి మునస్వామిపై 11,425 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1978 ఎన్నికల్లో జనతాపార్టీ అభ్యర్థి దొడ్డి వీరాస్వామిపై 21,414 ఓట్ల తేడాతో విజయఢంకా మోగించారు. ఈ హ్యాట్రిక్ రికార్డు సూళ్లూరుపేటలో ఇప్పటిదాకా ఎవ్వరూ బ్రేక్ చేయలేకపోయారు. 1994, 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పరసా వెంకటరత్నయ్య రెండుసార్లు గెలుపొందినా, 2004లో ఓడిపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. మూడోసారి పోటీ చేస్తున్నారు.

- తడ